క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ : స్వామి వివేకానంద సంస్థలో శంకర్ ఫౌండేషన్ నిర్వాహకులు శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు రెండు వందల మంది వరకు ఈ శిబిరానికి హాజరయ్యారు. వారిలో 30 మందికి శస్త్ర చికిత్సలు అవసరం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఏవీఎన్ కళాశాల సమీపంలో ఉన్న లెప్రసీ ప్రేమ సమాజంలో తొమ్మిది మందికి వాల్తేరు రౌండ్ టేబుల్ ఇండియా నిర్వాహకులు కళ్లద్దాలు అందజేశారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశి, వివేక్, చిన్నమ్ములు, కల్పన, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ, కేజీహెచ్‌లో ఫార్మాకో విజిలెన్స్ వీక్



మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో శనివారం ఫార్మాకో విజిలెన్స్ వీక్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కొన్ని మందుల వల్ల కలిగే దుష్ప్రభావంపై ఎంబీబీఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోగులు, వారి సహాయకులకు కరపత్రాలు పంపిణీ చేసి ఫార్మాకో విజిలెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. కేజీహెచ్‌లో కూడా దీనిపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ నర్సింగ్ విద్యార్థులు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ డి. శ్యామల, ఏఎంసీ ఫార్మకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె. హిమబిందు పాల్గొన్నారు.

శివపదం.. భావితరాలకు మార్గదర్శకం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ తదితరులు

మద్దిలపాలెం: శివపదాలు అంతరంగ భావాలకు ప్రతిబింబాలుగా, ఆధ్యాత్మిక చైతన్య ప్రబోధాలుగా, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. శివపదం సంకీర్తన యజ్ఞం చివరి రోజు శనివారం శివ నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమాన్ని షణ్ముఖశర్మ, వీఎండీపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎస్.రాజు, డాక్టర్ రాంబాబు, కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణ గాయత్రి, వి.వి.ఆదినారాయణమూర్తి, టి.రవిరాజు, పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బ్రహ్మశ్రీ షణ్ముఖ శర్మ ప్రవచిస్తూ శివ నామస్మరణ మానవీయ ప్రబంధానికి ఎంతో దోహదపడుతుందన్నారు. శివపదాల భావాన్ని అర్థం చేసుకుని అవగతం చేసుకుంటే జీవనం ఆధ్యాత్మికతతో నిండిపోతుందని చెప్పారు. సంగీతం, సాహిత్య పరంగా తాను రచించిన శివపదాలను ప్రముఖ సంగీత విద్వాంసులు స్వరపరచి, తమ మధుర గానం, చక్కని శాస్త్రీయ నృత్య కళారీతులతో ప్రదర్శిస్తూ ఖండాంతరాలకు చాటిచెప్పే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. శివపదాలు విశ్వవ్యాప్తం చేస్తున్న కళాకారులు, కళాభిమానులకు పరమశివుడి ఆశీస్సులు లభిస్తాయన్నారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కౌశిక్ కల్యాణ్ తమ శిష్య బృందం తెన్నేటి, ఓలేటి సోదరీమణులు, దేవులపల్లి గోపీకిషోర్ బృందాలు గానామృతంతో సభికులను మంత్రముగ్ధులను చేశారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, విశాఖ రుషిపీఠం సత్సంగం సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి.



రోడ్డు లేక రాళ్ల పైనే పని చేసుకుంటున్న చిరు బంగారు వర్తకుడు



కురుపాం మార్కెట్ వద్ద ప్రారంభం కాని కాలువల నిర్మాణం



టౌన్ కొత్తరోడ్డు వద్ద రహదారి పైనే వదిలేసిన డెబ్రిస్

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

జగదాంబ జంక్షన్ రహదారిని విస్తరించి.. అక్కడి ఇరుకు సమస్యను పరిష్కరించేందుకు కొన్నేళ్ల కిందట విస్తరణ పనులు ప్రారంభించారు. అయితే సగం పనులు అయ్యాక మధ్యలో వదిలేయటంతో వ్యాపారులు, స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పనులు మధ్యలో ఆగిపోవడం వల్ల నిర్మాణ సామగ్రి రోడ్లపైనే వదిలేయడం వల్ల రాళ్లు, రప్పలు, ఇసుక, సిమెంట్ వ్యర్థాలపై నడిచేందుకు, వాహనాలు ప్రయాణించేందుకు ఇబ్బందిగా ఉందని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు. త్వరగా రహదారి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

- ముందుకు సాగని వన్‌టౌన్ రహదారి విస్తరణ పనులు
- భవన యాజమానులకు అందని టీడీఆర్‌లు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, స్థానికులు, వాహన చోదకులు

జగదాంబ : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా అభివృద్ధి లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. ముఖ్యంగా జగదాంబ నుండి వన్‌టౌన్ వరకు రహదారి నిర్మాణం పూర్తి కాక స్థానికులు, వ్యాపారులు, వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టిన నేపథ్యంలో కాలువలు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ స్తంభాలతో పాటు బీటీ రోడ్డు నిర్మాణం వంటివి శరవేగంగా జరిగాయి. రహదారి విస్తరణ పనుల కోసం రూ. 4.50 కోట్లు, కాలువలకు రూ. 4.50 కోట్లు, ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించి మూడు టెంటర్లుగా విభజించి పనులు ప్రారంభించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పనులపై ఆసక్తి చూపలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

మా దుకాణాలు తొలగించుకున్నాం..

అధికారుల ఆదేశాల మేరకు తాము పనులకు అడ్డం లేకుండా తమ దుకాణాలు తొలగించామని, రోడ్డు వెడల్పు పనులు పూర్తి అయితే తాము కూడా దుకాణాలు పునర్నిర్మించుకుంటామని వన్‌టౌన్‌లోని చిరు వ్యాపారులు చెబుతున్నారు.

అయోమయంలో వ్యాపారులు..

రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఏవీఎన్ కళాశాల డౌన్ వరకు కాలువలు, ఫుట్‌పాత్ పనులు జరిగాయి. టౌన్ కొత్తరోడ్డు, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు మాత్రం సగం మేర పనులు మాత్రమే చేస్తుండడంతో విస్తరణ పనులు పూర్తిగా అవుతాయా అనే సందేహం కలుగుతుందని వ్యాపారులు, స్థానికులు అంటున్నారు. ఇప్పటికే కొందరు భవన యాజమానులు వారి సొంత స్థలాలు జీవీఎంసీకి అప్పగించారు. టీడీఆర్‌లు ఇస్తారన్న ఆశతో జీవీఎంసీ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నామని వాళ్లు చెబుతున్నారు. మరి కొందరు వ్యాపారులు రహదారి పనులు పూర్తి అయిన తర్వాత నిర్మాణాలు చేసుకోవాలని ఎదురు చూస్తున్నారు. కానీ పనులు జరగకపోవడంతో తమకు ఏం చేయాలో తెలియడం లేదని వాపోతున్నారు.

వ్యాపారులకు ఇబ్బందులు..

రహదారి విస్తరణ పనులు వేగంగా జరగకపోవడంతో వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ముందు సగం పూర్తి చేసిన కాలువల వల్ల వినియోగదారులు దుకాణాల్లోకి రాలేకపోతున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే రహదారి పక్కన విక్రయాలు చేసుకునే చిరు వ్యాపారులు కూడా రహదారి నిర్మాణం కాకపోవడం వల్ల తమ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని చెబుతున్నారు. అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



పూర్తిగా నిర్మాణం కాని రాళ్లు తేలిన వన్‌టౌన్ రహదారి

పనులు ఆగిపోయాయి..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణ పనులు వేగంగా జరిగాయి. ఇందుకు వ్యాపారులంతా సహకరించారు. ఎన్నికల తర్వాత ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీని వలన మా లాంటి చిరువ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్మాణం పూర్తి చేయాలి.

– జి.శ్రీనివాస్, బంగారం వర్తకుడు, పాతనగరం

వ్యాపారాలు దెబ్బతిన్నాయి..



రహదారి విస్తరణ పూర్తి స్థాయిలో జరగకపోవడం వల్ల వినియోగదారుల తాకిడి తగ్గిపోయింది. వన్‌టౌన్‌కు రావాలంటే వినియోగదారులకు గండంలా అనిపిస్తుంది. దాంతో ఏ అవసరానికి అయినా ఇక్కడికి వచ్చే వినియోగదారులు గతంలో వచ్చినట్లు రావడం లేదు. దీంతో మా వ్యాపారాలు దెబ్బతిన్నాయి. జీవీఎంసీ టీడీఆర్‌లు కూడా ఇవ్వడంలేదు.

– గోపాల్, బంగారం వ్యాపారి, వన్‌టౌన్

ఇస్కఫ్ కృషి నిరుపమానం



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

మహారాణిపేట : దేశ సమగ్రత, సంస్కృతి, మత సామరస్యానికి ఇస్కఫ్ ఎంతో కృషి చేస్తోందని నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. శనివారం ప్రభుత్వ మహిళా కాలేజీ ఆవరణలో అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్, ఐఎస్‌సీయూఎఫ్) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సంస్థ అనేక జాతీయ, అంతర్జాతీయ శాంతి ఉద్యమాల్లో పాల్గొందన్నారు. ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఇస్కఫ్ నాయకుడు టీఎస్ సుకుమారన్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన మహిళా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వై.వెంకట లక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమ కాలేజీలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్‌కు చెందిన నరసింహులు, ఎం.ఎ. బేగం, పద్మకుమారి ,డి.మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



సహస్ర తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : శనివారం ఉదయం 8 గంటలకు కనకమహాలక్ష్మి అమ్మవారికి నిర్వహించిన సహస్ర తులసిపూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ పూజకు దంపతులను, లేదా ఇద్దరు భక్తులను అనుమతిస్తారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి పూజలో ఉభయదాతలు పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి



గురజాడ అప్పారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

సీతమ్మధార : మహాకవి గురజాడ అప్పారావు రచించిన గీతం ఇప్పటికీ ప్రజల్లో దేశభక్తి ఉప్పొంగేలా చేస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురజాడ 162వ జయంతి కార్యక్రమం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఆయన విగ్రహం వద్ద శనివారం ఐద్వా, పీఏఎస్ఎం, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ గీతాన్ని అనుసరిస్తే దేశం త్వరగా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఆయన కన్యాశుల్కం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టిన మహానుభావుడని గుర్తు చేశారు. ఆయన 150 ఏళ్ల క్రితమే సమాజాన్ని మేల్కొలిపారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారతను కాలరాస్తూ మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెస్తుందని ఆరోపించారు. ప్రస్తుత సమాజానికి గురజాడ వారసులు ఎంతైనా అవసరం అన్నారు. ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, జిల్లా కార్యదర్శి ఎం.చంటి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నేతలు కె.మణి, ఆర్. వరలక్ష్మి, ఒ.విజయ, ఎం.అన్నపూర్ణ, సుజాత, కె.ఎల్. పద్మ, జి.లక్ష్మి, జి.మణి, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు ఎస్.వి.రమణ, మౌలాలి, డీవైఎఫ్ఐ నాయకుడు కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లతో ఇక్కట్లు



డైమండ్ పార్కు రోడ్డులో వెలగని వీధిలైట్లు



డైమండ్ పార్కు వద్ద పని చేయని వీధి లైట్లు



ద్వారకానగర్ నాలుగో లైన్‌లో వెలగని వీధిలైట్లు



ద్వారకానగర్ మూడవ లైన్‌లో వెలగని వీధి లైట్లు

సీతమ్మధార : ద్వారకానగర్‌లోని డైమండ్ పార్కు నుంచి శంకరమఠం వెళ్లే రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. 15 రోజులుగా ఇక్కడి దీపాలు వెలగకున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇక్కడి సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శి ప్రతిరోజూ సాయంత్రం 6 తర్వాత వెలగని వీధిలైట్ల నంబర్లు నోట్ చేసుకోవాల్సి ఉంది. జీవీఎంసీ కమిషనర్ ఇటీవల నిర్వహించిన ఎమినిటీస్ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఈ విషయం స్పష్టం చేశారు. అయినా కొంతమంది ఎమినిటీస్ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పలు ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. అలాగే గతంలో వలంటీర్ల వాట్సప్ గ్రూపులో వెలగని వీధిలైట్ల నంబర్లు పోస్టింగ్ చేస్తే వలంటీర్ ఆ సమాచారాన్ని జోనల్ కార్యాలయం అధికారులకు ఫార్వర్డ్ చేసేవారు. అధికారులు సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించేవారు. ఇప్పుడు వార్డు వలంటీర్లు, వాట్సప్ గ్రూపులు లేనందున ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ –3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు వెంటనే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మకు జ్ఞాపిక అందిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు



హాజరైన వైద్య విద్యార్థులు

మహారాణిపేట : విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు అన్నారు. శనివారం ఏఎంసీ సెంటినరీ ఎగ్జామ్ హాల్లో యాంటీ ర్యాగింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ క్యాంపస్‌ను ర్యాగింగ్ ఫ్రీగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధ చట్టం, 1997 దాని సవరణల ముఖ్య లక్షణాలను వివరించారు. యాంటీ ర్యాగింగ్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ఎ. కృష్ణవేణి, ఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా లుమియర్-24 వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, పలు కళాశాలల విద్యార్థులు

కంచరపాలెం : క్విజ్, వక్తృత్వం, గ్రామర్ వంటి పోటీల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. శనివారం కళాశాలలో లుమియర్ 2కె24 అంతర కళాశాలల పోటీలు ఘనంగా నిర్వహించారు. 8 డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. వీఎస్ కృష్ణ, గాయిత్రి, ఏవీఎన్, సెయింట్ ఆన్స్, సెయింట్ జోసెఫ్ కళాశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ముఖ్య అతిథిగా ద్వితీయ భాషా విభాగం అధ్యాపకులు పి.కె. జయలక్ష్మి హాజరైన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నళిని, వీణ, ప్రమీల, సుధ, టోనియా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రంగిరీజు వీధి యూపీహెచ్‌సీ సందర్శన



యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం రంగిరీజు వీధి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌కు ముందుగా ప్రణాళిక వేసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ప్రతి ఒక్క ఏఎన్ఎం లబ్ధిదారుల జాబితా వ్యాక్సినేషన్ రోజున దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. రంగిరీజు వీధిలో గల 190 సచివాలయంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్కడి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వారందరికీ అభ యాప్‌లో శత శాతం ఐడీలు క్రియేట్ చేయాలని తెలిపారు. అనంతరం వన్‌టౌన్‌లో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సమయపాలన పాటించాలని, లీవ్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. స్థానికులకు పరిశుభ్రత, ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలిపారు. జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుండీలనూ వదలడం లేదు

- జోన్-3లో యథేచ్ఛగా చోరీలు



చెత్త కుండీ చోరీ కావడంతో బోసిపోయిన డస్ట్‌బిన్ స్టాండ్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్-3 పరిధిలో చిల్లర దొంగలు చెలరేగిపోతున్నారు. ఇప్పటికే పలు బస్ షెల్టర్లలో ఇనుప బెంచీలు చోరీ చేస్తున్న దొంగలు కొంత కాలంగా చెత్తకుండీలను సైతం తస్కరిస్తున్నారు. జోన్-3 పరిధి 27వ వార్డు సీబీఎం కాంపౌండ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వెళ్లే మెయిన్‌రోడ్డులో కొద్దిరోజుల క్రితమే చెత్తకుండీలు చోరీ చేశారు. ఇంకా గురుద్వారా, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ గతంలో ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్తకుండీలు ఆనవాలు కూడా లేకుండా మాయమైపోయాయి. ఫలితంగా ఈ ప్రాంతాల్లో చెత్తకుండీల స్టాండ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ, పోలీసు కంట్రోల్ రూమ్, కమాండ్ కంట్రోల్ రూమ్ వంటివి ఉన్నప్పటికీ, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షిస్తున్నా చిల్లర దొంగలు మాత్రం దొరకడం లేదు. జోన్ పరిధిలో ఇనుప తుక్కు వ్యాపారులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ పోలీసులు తనిఖీలు చేస్తే దొంగలను ఇట్టే పట్టుకోవచ్చని ప్రజలు సూచిస్తున్నారు. ఆ దిశగా జోనల్ అధికారులు, పోలీసులు దృష్టి సారించడం, రాత్రి గస్తీ నిర్వహిస్తే చిల్లర దొంగలు దొరికిపోతారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లలితాపీఠంలో సంకటహర చతుర్థి

సీతంపేట : సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక లలితాపీఠంలో శనివారం సాయంత్రం వినాయకునికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణనాథునికి అత్యంత ప్రీతిపాత్రమైన తిథులలో చతుర్థి ఒకటని, కష్టాల నుంచి గట్టెక్కించే సంకటహర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేస్ తెలిపారు. అనంతరం గణపతి హోమం నిర్వహించారు. గణపతి హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయం, శంకరమఠం రోడ్‌లో విజయ గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి పూజలు నిర్వహించారు.

భూదాన్ భూములను కాపాడాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మండలి సభ్యులు

మహారాణిపేట : భూ మాఫియా, పెత్తందార్ల కన్ను భూదాన్ భూములపై పడిందని, ఆ భూములను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు నీలం రాంబాబు నాయుడు కోరారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను మండలి సభ్యులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. విశాఖ జిల్లా చిన గదిలి మండలం పరదేశిపాలెంలో 50.56 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూదాన్ భూమిని ఆక్రమించుకోవడానికి కొంత మంది దళారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రాజకీయ నాయకుల అండతో బడా బాబులు నకిలీ పత్రాలు సృష్టించి ఈ భూమిని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టి భూదాన్ భూములను కాపాడాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ చేపట్టి భూదాన్ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ దీనబంధు, సర్వోదయ మండల్ రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

మురళీనగర్ : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.దేముడు పిలుపునిచ్చారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో వాల్తేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు, చీపురుపల్లి సత్యారావు, కాలేజీ డిపార్టుమెంట్ హెడ్‌లు పాల్గొన్నారు.